నూతనోత్సాహం

- 'మేము సిద్ధం బస్సు యాత్ర' విజయవంతంతో వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో ఫుల్‌జోష్
- సీఎం వైఎస్ జగన్‌కు ప్రజల నుంచి అపూర్వ ఆదరణపై హర్షాతిరేకాలు
- ఎంవీవీ నామినేషన్ ర్యాలీకి విశేష స్పందన

ఆరిలోవ: సీఎం జగన్ తలపెట్టిన మేము సిద్ధం బస్సు యాత్ర వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో నూతనోత్సాహం నింపింది. ఇటీవల తూర్పు నియోజకవర్గం మీదుగా సాగిన ఈ యాత్రకు ప్రజలు బ్రహ్మరథం పట్టడంతో ఫుల్‌జోష్ కనిపిస్తోంది. మరోవైపు బుధవారం పార్టీ తూర్పు నియోజకవర్గ అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ నిర్వహించిన నామినేషన్ ర్యాలీకి విశేష స్పందన లభించింది. ఈ రెండు కార్యక్రమాలు విజయవంతం కావడంతో ఈ ఎన్నికల్లో తూర్పులో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేస్తామన్న ధీమా ఆ పార్టీ శ్రేణుల్లో కనిపిస్తోంది. తూర్పులో మద్దిలపాలెం ప్రాంతంలో ప్రవేశించిన వైఎస్ జగన్ బస్సు యాత్ర జాతీయ రహదారి మీదుగా డెయిరీఫారం వరకు సుమారు మూడు కిలోమీటర్ల మేర సాగింది. దారి పొడవునా వేల సంఖ్యలో ప్రజలు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి జేజేలు పలికారు. నియోజకవర్గంలో 15 వార్డులకు చెందిన ఆరిలోవ, ఆదర్శనగర్, కొండవాలు ప్రాంతాలు, విశాలాక్షినగర్, ఎంవీపీ కాలనీ, పెదజాలరిపేట, అప్పుఘర్, పెదవాల్తేరు, చినవాల్తేరు, హెచ్‌బీ కాలనీ, ఇసుకతోట, వెంకోజీపాలెం, పిఠాపురం కాలనీ, మద్దిలపాలెం ప్రాంతాల నుంచి వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు ఆటోలు, ద్విచక్ర వాహనాలపై ఇసుకతోట కూడలికి చేరుకుని ఎమ్మెల్యే అభ్యర్థి, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రికి ఘన స్వాగతం పలికారు. అక్కడ ముఖ్యమంత్రి కార్యకర్తకు అభివాదం చేసి ఆప్యాయతగా పలకరించారు. వెంకోజీపాలెం, హనుమంతవాక, డెయిరీ ఫారం వరకు బస్సు యాత్ర వెనక జనం నడిచి తమ మద్దతు తెలిపారు.


ఇసుకతోట కూడలిలో ప్రజలకు అభివాదం చేస్తున్న సీఎం జగన్, చిత్రంలో ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ(ఫైల్)

'పచ్చ' నాయకుల్లో గుబులు

నియోజకవర్గంలో ఓ పక్క వైఎస్సార్‌సీపీలో జోష్ పెరుగుతుంటే.. మరో పక్క టీడీపీలో ఆందోళన ఎక్కువవుతోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చేపట్టిన మేమంతా సిద్ధం బస్సు యాత్ర తూర్పులో విజయవంతం కావడం, రోజురోజుకూ ఇతర పార్టీలు, తటస్థులు వైఎస్సార్‌సీపీలో చేరుతుండడంతో టీడీపీలో మరింత గుబులు మొదలైంది. ఆ పార్టీ నాయకుల్లోనే ఈ సారి ఓడిపోతామేమోననే భయం పట్టుకుంది. నియోజకవర్గం ఏర్పడి మూడు సార్లు విజయం సాధించిన టీడీపీకి ఈసారి ఓటమి తప్పదనే సంకేతాలు ఆ పార్టీ నాయకులే ఎమ్మెల్యే అభ్యర్థి వెలగపూడి రామకృష్ణబాబుకు పంపిస్తున్నారట.

ఉప్పొంగిన అభిమానం


గురువారం నిర్వహించిన నామినేషన్ ర్యాలీ (ఇన్‌సెట్) ప్రజలకు అభివాదం చేస్తున్న ఎంవీవీ

వైఎస్సార్‌సీపీ విశాఖ తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ నామినేషన్ ర్యాలీతో రోడ్లు కిక్కిరిసిపోయాయి. వేలాది మంది పార్టీ శ్రేణులు, తరలి వచ్చిన ప్రజలతో సందడి నెలకొంది. ఆరిలోవ కాలనీ ఆఖరి బస్టాప్ వద్ద ఉన్న మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం నుంచి ప్రారంభమైన ర్యాలీ దుర్గాబజార్, ఆదర్శనగర్, విశాలాక్షినగర్, జోడుగుళ్లపాలెం, విశాఖ కంటి ఆస్పత్రి, సిరిపురం కూడలి, పందిమెట్ట కూడలి, జిల్లా పరిషత్ వరకు సాగింది. ర్యాలీలో రాజ్యసభ సభ్యుడు వై.వి.సుబ్బారెడ్డి, మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, వైఎస్సార్‌సీపీ విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ, జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, కార్పొరేటర్లు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు పాల్గొని శ్రేణుల్లో ఉత్సాహం నింపారు.

టీడీపీలో 'అక్కరమాని' కుంపటి

నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ ఫుల్ జోష్ మీద ఉండడంతో ఏం చేయాలో దిక్కుతోచని స్థితిలో ఉన్న వెలగపూడికి.. అక్కరమాని రూపంలో మరో కొత్త తాలనొప్పి తోడైందట. వైఎస్సార్‌సీపీలో అక్కరమాని వెంకటరావు, విజయనిర్మల ఉన్నప్పుడు వారిపై వ్యతిరేకతతో ఆ పార్టీలో ఉన్న వారే ఎక్కువ మంది టీడీపీకి మద్దతు ఇస్తున్నారు. ఇటీవల అక్కరమాని దంపతులు టీడీపీలో చేరడంతో వాళ్లకు వ్యతిరేక వర్గమంతా ఇప్పుడు వైఎస్సార్‌సీపీ వైపు తిరిగిపోతున్నారట. దీంతో పాటు ఇంత వరకు వైఎస్సార్‌సీపీలో అక్కరమాని దంపతులపై మొహమాటంతో ఉన్నవారంతా ఇప్పుడు స్వేచ్ఛా జీవులై ఎంవీవీ ప్రచారంలో చురుగ్గా పాల్గొంటున్నారట. అక్కరమాని పార్టీని వీడిన తూర్పు నియోజకవర్గం నుంచి వాళ్లతో కలిసి ఎవ్వరూ టీడీపీలోకి వెళ్లకపోవడమే ఇందుకు నిదర్శనమని చెబుతున్నారు. అక్కరమాని రాకతో ఇప్పుడు తమ అసలు ఓటు బ్యాంక్‌కు గండిపడినట్లు ఉందని వెలగపూడి మదనపడుతున్నారని ఆ పార్టీ నాయకులు చెబుతున్నారు.

తూర్పులో 30 నామినేషన్లు

ఆరిలోవ: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా నామినేషన్ల దాఖలు ప్రక్రియ గురువారం ముగిసింది. తూర్పు నియోజకవర్గం నుంచి 30 నామినేషన్లు దాఖలయ్యాయి. నామినేషన్ల ప్రక్రియ ఈ నెల 18 నుంచి ప్రారంభమైన విషయం తెలిసిందే. ఆఖరు రోజు గురువారం 8 నామినేషన్లు వేశారు. అత్యధికంగా ఈ నెల 24న 9 మంది నామినేషన్లు దాఖలు చేశారు. వైఎస్సార్‌సీపీ నుంచి 4 సెట్లు, టీడీపీ నుంచి 6 సెట్లు, జాతీయ కాంగ్రెస్ పార్టీ నుంచి 2 సెట్లు, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా నుంచి 2 సెట్లు, ప్రజా ప్రస్థానం పార్టీ నుంచి 1, యువజన చైతన్య పార్టీ నుంచి 1 సెట్, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా నుంచి 1 సెట్, బహుజన సమాజ్ పార్టీ నుంచి 1 సెట్, జైభారత్ నేషనల్ పార్టీ నుంచి 1, నవరంగ కాంగ్రెస్ పార్టీ నుంచి 1, నవభారత నిర్మాణ సేవా పార్టీ నుంచి 1, జాతీయ జనసేన పార్టీ నుంచి 1, స్వతంత్ర అభ్యర్థులుగా 8 సెట్లు వేశారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే అభ్యర్థులుగా మొత్తం 22 మంది నామినేషన్లు వేశారు. వారిలో 8 మంది స్వతంత్ర అభ్యర్థులు ఉన్నారు. సురేష్ మీనన్ అనే దివ్యాంగుడు స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేయడం విశేషం.

కవుల కృషితో సామాజిక రుగ్మతల నిర్మూలన

ఏయూక్యాంపస్: సామాజిక రుగ్మతలను నిర్మూలించే విధంగా ఉత్తరాంధ్ర కవులు కృషి చేశారని ఏయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య నరసింహారావు అన్నారు. గురువారం ఏయూలో నిర్వహించిన ఉత్తరాంధ్ర అభివృద్ధి, సాహిత్యంలో ప్రతిఫలాలు జాతీయ సదస్సును ఆయన ప్రారంభించారు. సదస్సు కన్వీనర్ ఆచార్య సీతారత్నం మాట్లాడుతూ రచనల్లో ఆధునిక భావజాలం అందించి సమత్వ భావజాల ఆవశ్యకతలను మొదటి ఉత్తరాంధ్ర గుర్తించిందన్నారు. విశిష్ట అతిథి రచయిత అట్టాడ అప్పలనాయుడు మాట్లాడుతూ సాహిత్యంలో వచ్చిన వైవిధ్యభరిత సాహిత్య ప్రక్రియలపై లోతైన చర్చ జరగాల్సిన అవసరం ఉందన్నారు. ఆత్మీయ అతిథి చీకటి దివాకర్ మాట్లాడుతూ ఉత్తరాంధ్ర సాహిత్యంపై విశ్వవిద్యాలయాలలో మేధో మథనం జరగాలని సూచించారు. విశిష్ట అతిథి ఆచార్య హనుమంతు లజపతిరాయ్ మాట్లాడుతూ ప్రపంచీకరణ దృష్టి కోణంలో సాహిత్యాన్ని కవులు రాయాలన్నారు. కార్యక్రమానికి ఏయూ హిందీ విభాగం ఆచార్యులు కె.విజయభారతి సహ కన్వీనర్‌గా వ్యవహరించారు. మూడు జిల్లాల నుంచి 120 మంది కవులు, రచయితలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కవులు సిరికి స్వామినాయుడు, పాయల మురళీకృష్ణ, లండ సాంబమూర్తి, గౌరీ శంకర్ శివరాం, ఉపద్రష్ట శర్మ, కూర్మారావు, స్వరాజ్యం రవణమ్మ, విశాలాక్షి, తదితరులు పాల్గొన్నారు.



ప్రిన్సిపాల్ నరసింహారావును సత్కరిస్తున్న నిర్వాహకులు

మలేరియాపై అప్రమత్తం

మహారాణిపేట : దోమ కాటు వల్ల వచ్చే మలేరియా వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో డాక్టర్ పి. జగదీశ్వరరావు అన్నారు. ప్రపంచ మలేరియా నివారణ దినోత్సవం సందర్భంగా డీఎంహెచ్‌వో ఆధ్వర్యంలో ర్యాలీ జరిపి మానవహారం నిర్వహించారు. రేసవానిపాలెం వద్ద మొదలైన ర్యాలీ టీబీ ఆస్పత్రి, సత్యం జంక్షన్ మీదుగా తిరిగి డీఎంహెచ్‌వో కార్యాలయానికి చేరుకుంది. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు మాట్లాడుతూ విశాఖలో మలేరియా కేసులు గణనీయంగా తగ్గాయన్నారు. మలేరియా నివారణకు దోమతెరలు వాడాలని, నీటి నిల్వలు లేకుండా పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. ప్రతీ శుక్రవారం ఫ్రైడే - డ్రైడే పాటించాలన్నారు. జోనల్ మలేరియా అధికారి డాక్టర్ శాంతి ప్రభ మాట్లాడుతూ ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా ఈ ర్యాలీ చేపట్టినట్లు తెలిపారు. మలేరియా వ్యాధి ఏఎస్ఆర్ జిల్లా, మన్యం ప్రాంతంలో ఎక్కువగా ఉందని అన్నారు. జిల్లా మలేరియా అధికారి తులసీరాజ్ మాట్లాడుతూ మలేరియా వ్యాధి నివారణకు ఆరోగ్య సిబ్బంది యాంటీ లార్వా స్ప్రేయింగ్ చేస్తున్నారని తెలిపారు.

ఈ కార్యక్రమంలో రీజినల్ ట్రైనింగ్ సెంటర్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సుజాత, జిల్లా మీడియా విస్తరణాధికారి (డెమో) బి.నాగేశ్వరరావు, ప్రోగ్రాం అధికారులు, వైద్య ఆరోగ్య సిబ్బంది, మలేరియా సిబ్బంది, నర్సింగ్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

క్లుప్తంగా

ఘనంగా సాయిబాబా ఆలయ వార్షికోత్సవం


భక్తులకు భోజనం వడ్డిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు గొలగాని శ్రీనివాస్

ఆరిలోవ : జీవీఎంసీ 11వ వార్డు బాలాజీనగర్‌లో షిర్డీ సాయిబాబా ఆలయ 16వ వార్షికోత్సవం గురువారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయంలో సాయిబాబాను పూలమాలలతో అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకుని పూజలు, అభిషేకాలు చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు గొలగాని శ్రీనివాస్, తదితరులు స్వామిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన అన్నసమారాధనలో శ్రీనివాస్ పాల్గొని భక్తులకు భోజనాలు వడ్డించారు. బాలాజీనగర్, అన్నానగర్, డ్రైవర్స్‌కాలనీ, బీసీ కాలనీ ప్రాంతాల నుంచి భక్తులు పాల్గొని ప్రసాదం స్వీకరించారు.

'కళింగాంధ్ర కథా జాడ' పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ ఆచార్య ప్రసాద రెడ్డి

ఏయూ క్యాంపస్: కళింగాంధ్ర కథా జాడ పుస్తకాన్ని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాద రెడ్డి గురువారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. గురజాడ నుంచి ఇప్పటి వరకు ఉన్న నాలుగు తరాల కథలు దీనిలో పొందుపరిచారు. కళింగాంధ్ర సామాజిక పరిణామం తెలిపేలా పుస్తకం నిలుస్తుందని వీసీ తెలిపారు. ఉత్తరాంధ్ర రచయితల మనోభావాలు ఈ కథల్లో దర్శనమిస్తాయన్నారు. ఉత్తరాంధ్ర సమస్యలు, వాటి నివారణపై ఆలోచనలు రేకెత్తించేలా కథలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, సంపాదకులు అట్టాడ అప్పలనాయుడు, చీకటి దివాకర్, ఏయూ ఆచార్యులు ఎ.సీతారత్నం, జె.విజయభారతి, కె.రాజామాణిక్యం పాల్గొన్నారు.

ఒకటో తేదీ నుంచి ప్రత్యేక యోగా శిబిరాలు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం యోగా కేంద్రంలో చిన్నారుల కోసం ప్రత్యేక యోగా శిక్షణ శిబిరాన్ని వచ్చేనెల ఒకటి నుంచి 15వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు కేంద్రం సంచాలకుడు ఆచార్య ఓ.ఎస్.ఆర్.యు.భాను కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 7 నుంచి 15 సంవత్సరాలు వయస్సు కలిగిన బాల బాలికలు ఈ శిబిరంలో పాల్గొనవచ్చునన్నారు. ప్రతి రోజు ఉదయం 7 నుంచి 8 గంటల వరకు ఈ శిబిరం జరుగుతుందన్నారు.

- యోగా విలేజ్‌లో మే 1 నుంచి సాధారణ యోగ, స్థూలకాయ నివారణ శిబిరాలను ప్రారంభిస్తున్నట్లు కేంద్రం సంచాలకులు తెలిపారు. ఉదయం 7 నుంచి 8, ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సాధారణ యోగా, సాయంత్రం 4 నుంచి 5, సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు స్థూలకాయ నివారణ శిబిరాలు నిర్వహించనున్నామన్నారు. ఆసక్తి కలిగిన వారు 94944 01919, 93980 19922 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ఒకటి నుంచి బాలల నటనా శిక్షణ శిబిరం

ఏయూ క్యాంపస్: నవరస థియేటర్స్ ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వచ్చే నెల ఒకటో తేదీ నుంచి బాల బాలికల నటనా శిక్షణ శిబిరం నిర్వహించనున్నట్టు సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి పి.వి. రమణమూర్తి తెలిపారు. ఈ మేరకు పోస్టర్‌ను ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి గురువారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంగసాయి నాటక గ్రంథాలయం సహాయంతో నెల రోజుల శిక్షణ కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఆర్‌టీసీ కాంప్లెక్స్ దగ్గరున్న రంగసాయి నాటక గ్రంథాలయ ప్రాంగణంలో శిబిరం జరుగుతుందన్నారు. ఆసక్తి ఉన్న వారు పూర్తి వివరాలకు 98484 61959, 86395 07458 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్ఆర్, హేమా వెంకటేశ్వరి, డాక్టర్ కె.వెంకటరావు, బి.కృష్ణమూర్తి, ఎస్.తేజా, తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

కుటుంబ సభ్యుల చెంతకు సాయికుమార్

ఎంవీపీ కాలనీ: నిజామాబాద్ ప్రాంతానికి చెందిన గంధం సాయికుమార్‌ను పెదవాల్తేర్‌లోని రెడ్‌క్రాస్ హోం షెల్టర్ నిర్వాహకుడు మురళీ, మహారాణిపేట హెచ్‌సీ రవికుమార్ తమ కుటుంబ సభ్యులకు అప్పగించారు. సాయికుమార్ తల్లిదండ్రులు వ్యవసాయం చేస్తుండగా.. ఇంటర్ వరకు చదివిన సాయికుమార్ (23) ఉద్యోగం నిమిత్తం ఇంట్లో చెప్పకుండా బయటకు వచ్చేశాడు. గత కొంతకాలంగా అతని ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు గాలిస్తున్నారు. ఈ క్రమంలో నిజామాబాద్ పోలీసులకు సైతం ఫిర్యాదు చేశారు. దీంతో నిజామాబాద్ పోలీసులు సాయికుమార్ ఫోన్ నంబర్ ఆధారంగా లోకేషన్ ట్రాక్ చేయగా.. విశాఖపట్నంలో ఉన్నట్లు తేలింది. దీంతో విశాఖ పోలీసులకు సమాచారం అందించడంతో మహారాణిపేట సీఐ పి.శ్రీనివాసరావు పర్యవేక్షణలో సిబ్బంది, రెడ్ క్రాస్ ప్రతినిధులు సాయిని పట్టుకున్నారు. అనంతరం రెడ్ క్రాస్‌లో అతన్ని ఉంచి గురువారం కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ సందర్భంగా విశాఖ పోలీసులు, రెడ్ క్రాస్ ప్రతినిధుల సేవలను వారు అభినందించారు.


సాయికుమార్‌ను తండ్రికి అప్పగిస్తున్న రెడ్‌క్రాస్, పోలీసు సిబ్బంది

పేదల చిరునవ్వే సీఎం జగన్ ధ్యేయం

- వైఎస్సార్‌సీపీ తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ
- 27వ వార్డు అమర్‌నగర్‌లో మేము సిద్ధం సభ

బీచ్ రోడ్డు: పేదల చిరునవ్వు, సంతోషమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలన సాగించారని వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గం అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ అన్నారు. గురువారం జీవీఎంసీ 27వ వార్డు అమర్‌నగర్‌లో మేము సిద్ధం సభ జరిగింది. ఈ సందర్భంగా ఎంవీవీ మాట్లాడుతూ పారదర్శకంగా సంక్షేమ పథకాల అమలు కోసం వలంటీర్ వ్యవస్థను ప్రవేశ పెట్టారన్నారు. ఐదేళ్లుగా ఇంటి వద్దకే పథకాలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందించిందన్నారు. ఎన్నికల కోడ్ పేరిట చంద్రబాబు కుట్రబుద్ధితో వలంటీర్ వ్యవస్థను నిలుపుదల చేశాడని ఎంవీవీ ఆరోపించారు. దీంతో వృద్ధులు, దివ్యాంగులు మళ్లీ పెన్షన్ల కోసం క్యూలైన్లలో ఉండాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. నాడు-నేడు పథకం ద్వారా విద్యా వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చిన జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. 27వ వార్డులో కోట్ల రూపాయల నిధులతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. పోలమాంబ ఆలయ ప్రాంతంలో రోడ్లు, విద్యుద్దీపాల అలంకరణలో అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి జరిగిందన్నారు. తూర్పు నియోజకవర్గంలో వెలగపూడి మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచినా ఎటువంటి అభివృద్ధి చేయలేదన్నారు. వంగవీటి రంగాను హత్య చేసి విశాఖకు వచ్చిన వెలగపూడికి ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు. ఇంటింటికి సంక్షేమ పథకాలు, నగరాభివృద్ధి వైఎస్సార్‌సీపీతో సాధ్యమని, ప్రజలు ఆలోచించి ఫ్యాన్ గుర్తుపై ఓటేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా బొత్స ఝాన్సీని గెలిపించాలని ఎంపీ ఎంవీవీ కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పి.వి.నారాయణ, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు బోని శివరామకృష్ణ, అల్లంపల్లి రాజబాబు, వార్డు అధ్యక్షుడు నీలాపు సర్వేశ్వరరెడ్డి, మత్స్యకార నాయకులు వాసుపల్లి జానకిరామ్, తదితరులు పాల్గొన్నారు.


ఫ్యాన్ గుర్తు చూపిస్తూ మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ

ది ఆర్ట్ ఆఫ్ మైండ్ కంట్రోల్‌పై నేడు ప్రసంగం

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం యోగా కేంద్రంలో శుక్రవారం ది ఆర్ట్ ఆఫ్ మైండ్ కంట్రోల్ అంశంపై ప్రత్యేక ప్రసంగం నిర్వహించనున్నట్టు కేంద్రం సంచాలకుడు ఆచార్య భానుకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 5 నుంచి 7 గంటలకు అక్షయ పాత్ర ఫౌండేషన్‌కు చెందిన శ్రీశ్యామ్ మాధవ దాస ప్రత్యేక ప్రసంగం చేస్తారని పేర్కొన్నారు.

విస్తృతంగా వాహనాల తనిఖీలు

సీతమ్మధార: మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గురువారం సీతమ్మధార అల్లూరి సీతారామరాజు జంక్షన్ తదితర ప్రాంతాల్లో స్టాటిక్ సేవలర్-1, జీవీఎంసీ జోన్-3 రెవెన్యూ ఆఫీసర్ కె.పైడిరాజు, ద్వారకా స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ జె.సురేష్‌కుమార్‌లు విస్తృతంగా వాహనాల తనిఖీలు నిర్వహించారు. కార్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు, అనుమానం వచ్చిన ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. వాహనాలపై నంబర్‌తోపాటు వాహనదారుడి పేరు నమోదు చేసుకున్నారు. ప్రయాణ వివరాలు సేకరించారు.


అల్లూరి జంక్షన్ రోడ్డులో కారును తనిఖీ చేస్తున్న పోలీసులు

జీఆర్పీ అదుపులో గంజాయి రవాణాదారుడు

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో గంజాయిని అక్రమంగా తరలిస్తున్న నిందితుడిని, గవర్నమెంట్ రైల్వే పోలీసులు గురువారం అదుపులోకి తీసుకుని 9 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. జీఆర్పీ సిబ్బంది తెలిపిన వివరాలిలా.. జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సిహెచ్.ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో ఎస్ఐ కె.శాంతారం తన సిబ్బందితో కలిసి విశాఖ రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫారాల్లో గురువారం ముమ్మర తనిఖీలు నిర్వహించారు. బిహార్‌కు చెందిన సోనుకుమార్ అనే వ్యక్తి బ్యాగును తనిఖీ చేయగా.. దానిలో అక్రమంగా రవాణా చేస్తున్న 9 కేజీల గంజాయి గుర్తించి, స్వాధీనం చేసుకున్నారు. ఇతడిని అదుపులోకి తీసుకుని, రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరిచినట్లు జీఆర్పీ ఎస్ఐ తెలిపారు.

హజ్ యాత్రికులకు శిక్షణ

సీతంపేట: యాసీన్ హజ్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో అక్కయ్యపాలెం షాదీఖానాలో గురువారం హజ్ యాత్రికులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. మౌలానా ఖుర్షిద్ ఆలమ్ శిక్షణ ఇచ్చారు. హజ్‌యాత్రలో భాగంగా మక్కా మదీనాలో అవలంభించాల్సిన పద్ధతులు, విధి విధానాలు, డ్రెస్ కోడ్(వైట్), చరిత్రాత్మక ప్రదేశాల గురించి వివరించారు. వివిధ ప్రాంతాలకు చెందిన 150 మంది యాత్రికులు హాజరయ్యారు. ఎం.డి.అహ్మదుల్లా ఖాన్, రహమతుల్లా బేగ్, ఆర్.ఎ.రజాక్, ఎస్.కె.అహ్మద్ వలి, అహ్మద్ బాషా పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీకి పట్టం కట్టండి

18వ వార్డులో ఎంపీ ఎంవీవీ విస్తృత ప్రచారం


18వ వార్డులో ప్రచారంలో భాగంగా ఎంవీవీకి హారతిపడుతున్న మహిళ


22వ వార్డులో ఎన్నికల ప్రచారం చేస్తున్న పీతల గోవింద్


17వ వార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న లావణ్య, సత్యవతి తదితరులు

ఎంవీపీ కాలనీ: విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ ఎన్నికల ప్రచారం గురువారం 18వ వార్డులో జోరుగా సాగింది. 96వ రోజు 18వ వార్డు అప్పుఘర్, మూలపాలెంలో పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంవీవీ మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి అద్భుతమైన సేవలు అందించిన వైఎస్సార్‌సీపీకి వచ్చే ఎన్నికల్లో ప్రజలు పట్టం కట్టాలని కోరారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేసిందన్నారు. మరోసారి వైఎస్సార్‌సీపీని గెలిపిస్తే అభివృద్ధి, సంక్షేమంలో రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి జగన్ దేశంలోనే అగ్రగామిగా నిలుపుతారన్నారు. వచ్చే ఎన్నికల్లో గెలిచిన వెంటనే విశాఖ వేదికగానే సీఎం జగన్ ప్రమాణ స్వీకారం చేస్తానని, ఇక్కడి నుంచే పాలన సాగిస్తానని విశాఖ వాసులకు మాటిచ్చిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో తూర్పు నియోజకవర్గంతో పాటు విశాఖలోని అన్ని స్థానాల నుంచి వైఎస్సార్‌సీపీని అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్ పేర్ల విజయచందర్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పీవీ నారాయణ, వాసుపల్లి ఎల్లాజీ, తదితరులు పాల్గొన్నారు.

జీవీఎంసీ 28వ వార్డులో..

బీచ్‌రోడ్డు: జీవీఎంసీ 28వ వార్డులో గురువారం కార్పొరేటర్ వల్లా అప్పలకొండ, వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి పల్లా దుర్గారావు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. శబరి నగర్, రెల్లీ వీధిలో ప్రతి ఇంటికి వెళ్లి వైఎస్సార్‌సీపీ ఎందుకు అధికారంలోకి రావాలో ప్రజలకు వివరించారు.

22వ వార్డులో..

జీవీఎంసీ 22వ వార్డులో వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి, పోలీసు హౌసింగ్ బోర్డు కార్పొరేషన్ డైరెక్టర్ పీతల గోవింద్ ప్రచారం చేశారు. పెద కృష్ణగుడి ప్రాంతంలో ప్రతీ ఇంటికి వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి మద్దతు పలకాలని కోరారు.

17వ వార్డులో..

ఎంవీపీ కాలనీ: జీవీఎంసీ 17వ వార్డు 138వ పోలింగ్ బూత్ పరిధిలో వైఎస్సార్‌సీపీ స్థానిక మండల ప్రధాన కార్యదర్శి పిల్లా సత్యవతితో కలిసి కార్పొరేటర్ గేదెల లావణ్య ఇంటింటి ప్రచారం చేశారు. ఫ్యాన్ గుర్తుపై ఓటేసి ఎమ్మెల్యేగా ఎంవీవీ సత్యనారాయణను, విశాఖ ఎంపీగా బొత్స ఝాన్సీని గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు పలికిల నీలారెడ్డి, వాసుపల్లి లక్ష్మణ్, దానేష్, సునీల్, శివకుమార్, చంద్రిక, దివ్యా రెడ్డి, 138 పోలింగ్ బూత్ కోర్ కమిటీ సభ్యులు గణేష్, మమత, గౌరీ, సంధ్య, వెంకటలక్ష్మి, కుమారి, రామలక్ష్మి, నూకరత్నం, మంగ, విజయ, తదితరులు పాల్గొన్నారు.